# అనుభవం.... అపూర్వం

ప్రభుకు మొదటినుంచి యిష్టం లేదు. ఉద్యోగం రాకుండానే సంసారాన్ని మెడకు కట్టుకోవడం. తీరా సమయం వచ్చినప్పుడు తల్లిదండ్రుల మాట కాదనడం కష్టం అయిపోయింది. వాళ్ళు చెబుతూవున్న దాన్లోనూ యేదో 'లాజిక్' వున్నట్లే అనిపించింది అతని మనసుకు.

'ఉద్యోగానికేం, యివాళ లేకపోతే రేపు వస్తుంది. దానికి కావలసిన అర్హతలన్నీ తయారు చేసుకొని కూర్చున్నావు గాని, అల్లాటప్పాగా యేం లేవుగా!' అన్నాడు తండ్రి.

అవును. భూగర్భశాస్త్రంలో ఎం.ఏ. తీసుకున్నాడు.

సాధారణంగా ఏం.ఏ. అయినవాళ్ళు లెక్చరరు ఉద్యోగంలో 'సెటిల్' అయిపోతారు. అయితే ఈ సబ్జెక్ట్ అన్ని కాలేజీలలో వుండదు. ఏ లెక్కలో, ఇంగ్లీషో తీసుకుంటే ఆ దారివేరు. జొత్తిగా 'భూగర్భ శాస్త్రం.'

భూగోళశాస్త్రం, ఖగోళం ... యిలాంటివి చదివిన వాళ్లు భూగర్భంలోనూ. అంతరిక్షంలోనూ తిరుగాడవలసిందే– తప్ప. వెనువెంటనే ఉద్యోగం దొరకదు గాక దొరగదు అని తెలిసిపోయింది.

"ఏమో యేం చెప్పగలం? అమ్మాయి అడుగుపెట్టిన వేళా విశేషంవల్ల నీకు మంచి ఉద్యోగం రావచ్చును. మనం మరీ మొండిగా వుండడం బాగుండదు. ముందు చూచివద్దాం– తరువాత ఆలోచించుకోవచ్చు', అంది అమ్మ.

ఇద్దరికీ ప్రభుకు త్వరగా పెళ్ళి చేసేయాలని మనసులో వున్నప్పటికీ పైకి యేమాత్రం తేలకుండా అంతా కొడుకు యిష్టం ప్రకారం చేస్తున్నట్లు మాటాడుతున్నారు. అసలు విషయం యేమిటంటే- పిల్లను యివ్వదలుచుకున్న మామగారు పనివేళా యింటికి వచ్చారు. కాబోయే అల్లుడికి ఇంకా ఉద్యోగం లేదని ఆయనకు తెలుసును. "ఏం ప్రయత్నం చేస్తున్నావు? ఎప్పటికి వస్తుందనుకుంటున్నావు? రాకపోతే యేం చేస్తావు?'- యిటువంటి

అసౌకర్యపు ప్రశ్నలువేసి చికాకు పెట్టకపోగా, అసలు ఉద్యోగం లేకుండా వుండడమే' సహజమైన స్థితి అన్నట్లుగా కనిపించింది ఆయన ధోరణి:

తీరా అమ్మాయిని చూచి వచ్చిన తర్వాత అమ్మ ఉత్సాహానికి అడ్డు లేకుండా పోయింది. 'అమ్మాయికి ఉద్యోగం వుంది. ఆ ఊళ్ళోనే ఒంటరిగా వుంటోంది. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో. తీరయిన ఉద్యోగం దొరికినప్పుడు మన వూరా కాదా, మనలోకమా కాదా, అని భయపడకుండా మంచిపని చేశారంటాను, ఆ అమ్మాయి తల్లిదండ్రులు. నాకు చాల నచ్చింది ఆ పిల్ల, విద్య.... వినయం....' అంటూ అమ్మ ఒకటే పొగడ్తలు.

నీవుగూడా యేమైనా ప్రశ్నలు వేసిచూడు, అని సూచన వచ్చినప్పుడు యేం అడగాలో వెంటనే తోచలేదు ప్రభుకు. ఆ అమ్మాయి చదువుకున్న ఎకౌంటన్సీ బ్యాంకింగ్ వ్యవహారాలు తనకు బొత్తిగా తెలియవు. నాలుగేళ్ళ నుంచి హాయిగా ఉద్యోగం చేసుకుంటూ నేడోరేపో పెద్దబ్రాంచికి మేనేజర్‌గా వెళ్ళబోయే అమ్మాయిని పట్టుకుని 'ఉద్యోగం చేయడం నీకు ఇష్టమేనా?' అని అడగడం తెలివితక్కువ ప్రశ్న- అని ప్రభు ముందుగానే నిశ్చయించుకున్నాడు.

'అమ్మాయికి మంచి ఉద్యోగం వుంది, మన అబ్బాయికి ఉద్యోగం లేదుగదా. బిడియపడతాడేమో' అన్నాడు నాన్న అమ్మతో.

'చాల్లేండి. మన అబ్బాయికి మటుకు నేడోరేపో ఉద్యోగం రాదా యేమిటి?' అని అమ్మ అన్నప్పుడు 'కన్యాశుల్కం'లో వెంకమ్మగారు గుర్తు వచ్చింది ప్రభుకు.

అవునవును- అనుకున్నారు అందరూ.

ప్రభుకూడా మీరాదేవిని చూచిన తర్వాత అంతకుముందు నుంచి మనసులోనేవున్న సందేహాలు కూడా తొలిగిపోయాయి.

వివాహం అయినాక, మీరాదేవి ఉద్యోగం చేస్తున్న ఊళ్ళోనే కాపురం పెట్టారు. ప్రభు ఉద్యోగప్రయత్నంలో వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. ఏదో ఆషామాషీ ఉద్యోగంలో చేరిపోవడం కుదరదు గద. తన చదువుకు, భార్య ఉద్యోగస్థాయికి తీసిపోని ఉద్యోగం రావడం లేదు అని తెలియటానికి సంవత్సరాలు పడుతుంది!

ఊరికే కూర్చోవడం ఎందుకని ప్రభు ఒక వ్యాపకం పెట్టుకున్నాడు. అదీ డబ్బు ఖర్చుతో కూడుకున్నదే.

భూగర్భశాస్త్రం గురించి సామాన్య పాఠకులకు అర్థం అయ్యేట్లుగా పత్రికలలో వ్యాసాలు రాయడం ప్రారంభించాడు.

కాస్త చేయి తిరిగింతర్వాత మరో ప్రయోగం కూడా చేశాడు.

మన పురాణాలలో వున్న కథలకు, భూగర్భశాస్త్రంలోని విషయాలకు సమన్వయం చేస్తూ మూల విషయాలను మనసుకు పట్టేట్టుగా చెప్పటానికి పురాణాలలో సాంకేతికంగా, కథలరూపంగా, ప్రతీకలుగా విషయాలు ప్రస్తావించారుసుమా- అన్న సంగతి సశాస్త్రీయంగా చెప్పడం మొదలుపెట్టాడు.

నాగలోకంలో 'మణి', నాగకన్యలతో పరిచయాలు, సగం శరీరం మనిషి- మరో సగం జంతువు, బొగ్గు గనులలో నల్లటి వికారమైన మనుషులు భూమి తూకాన్ని సరిగా వుంచటానికి సహాయపడడం.... సముద్రంలో వున్న మణులు మాణిక్యాలు, పంచభూతాలకు- భూమికివున్న అవినాభావ సంబంధం ఈ విషయాలన్నీ పాఠకులకు చక్కగా ఆకట్టుకునేట్లు తన రచనల్లో వివరించేవాడు ప్రభు.

కట్టుకథలకు శాస్త్రపరమైన సంగతులకు సమన్వయం! జనప్రియమైన శీర్షికలు కావాలనుకున్న పత్రికలు అతని వ్యాసాలకోసం పోటీలు పడడం కూడా ఆరంభం అయింది. ఉద్యోగం లేదు అన్న విషయం గమనానికే రాకుండా చేతినిండా బొచ్చెడు పని, క్షణం విరామం లేకుండా కాలం గడిచిపోయింది.

పత్రికలలో వస్తున్న వ్యాసాలవల్ల 'క్లాస్‌వన్' ఆఫీసర్ జీతానికి తగ్గకుండా ఆదాయం లభిస్తుండడంతో ఇదిమాత్రం ఉద్యోగంకాదా యేమిటి? అనిపించింది.

ఓ శుభ ముహూర్తాన అతనికి మరో మంచి ఆలోచన వచ్చింది- అది ఈ వ్యాసాలను ఇంగ్లీషులో కూడా వ్రాయడం! విషయం విజ్ఞానదాయకం గనుక, శాస్త్రాన్నీ మతాన్నీ కలిపే వంతెనగా రూపొందింది ఈ యత్నం.

మరో శుభముహూర్తాన, అందమైన వ్యాసాలు పది సంకలనం చేసి అమెరికాలోని ఒక పబ్లిషర్‌కు 'ఆఫర్' చేశాడు. పుస్తకంగా తీసుకు రావటానికి వీలు అవుతుందా పరిశీలించండని. భారత మత-శాస్త్ర సమన్వయం కూర్చే గ్రంథాలు ముందుగా ఆదేశం నుంచే వస్తే బాగుంటుంది కదూ!

ఆ రోజు ప్రభు భార్య ఆఫీసు నుంచి రావడం కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తూవున్నాడు. 'మీరా యింటికి రాగానే చెప్పేయాలి ... నాకంటే మీరాయె ఎక్కువ సంతోషిస్తుంది ... సందేహం లేదు' అనుకున్నాడు.

మీరా దేవి యింటికి వస్తూనే 'మీకో శుభవార్త అంది.

ప్రభు చెబుదామనుకున్న విషయం మనసు పొరల్లోకి వెళ్ళిపోయింది.

'మీరు తండ్రి కాబోతున్నారు' అంది మీరాదేవి రహస్యంగా అతని చెవిలో.

'అమ్మదొంగా! చెప్పావు కావేం?' అన్నాడు ప్రభు ఆమెను దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేస్తూ.

'అరగంట క్రితమే 'కన్‌ఫర్మ్' చేసింది. మీకే ముందుగా చెబుతున్నాను. అందుకోసమే పరుగెత్తుకుంటూ వచ్చాను' అంది మీరాదేవి. అతని కౌగిలిలో నుంచి తప్పించుకుందుకు నింపాదిగా ప్రయత్నం చేస్తూ.

టీలో బిస్కట్లు ముంచుకుతింటూ ధైర్యంగా ప్రభు అన్నాడు. 'నీకూ మరో శుభవార్త, మీరాదేవీ!'

మీరా అతని నోటికి 'స్వీట్' అందించింది. దాన్ని నమిలి తినడంలో కొంత సమయం హరించుకుపోయింది.

"ఏమిటది?" అని మీరా తొందర చేయసాగింది.

'ఆగు, చెబుతాను-' అని ప్రభు నిదానంగా సంబాళించుకోసాగాడు.

చెప్పటానికి మాటలు ముందుకు రావడంలేదు గాని, మీరాదేవి ముందుగానే ఊహించేస్తుందేమోనని అతనికి భయంగానే వుంది. 'నాకు ఉద్యోగం వచ్చింది' అని ఆమె ఎక్కడ అనుకుని పోతుందోనని భయపడిపోతున్న వాడిలాగ హడావిడిగా ప్రభు 'అమెరికన్ పబ్లిషర్ నా పుస్తకం ప్రచురించటానికి అంగీకరించాడు' అన్నాడు.

'కంగ్రాట్స్. మైడియర్ రైటర్- హస్‌బెండ్' అంది మీరాదేవి ఆనందాన్ని ఆపుకోలేక.

'మామూలు తెలుగు కుటుంబాల్లోలా కాకుండా, మనదంతా ప్రత్యేకం అయిపోయింది.'

'ఏమిటది?' అంది మీరాదేవి.

'కథలు- పుస్తకాలు రాయడం అడవాళ్లుచేసే పని కదూ!'

'ఓ. అదా?' అని నవ్వేసింది మీరాదేవి.

జ్ఞానాన్ని, ఆలోచనలను అందరితో పంచుకోవడమే ఉద్యోగం ఉద్దేశ్యం. డబ్బు- జాబ్ శాటిస్‌ఫాక్షన్- యిలాంటివన్నీ తరువాతి మాటలే.... అంటుంది మీరాదేవి.

ప్రభు యేదో ఆలోచనల్లో కూరుకుపోయి వుండడం గమనించి, ఆమె 'మీరాకే ప్రభూ! మామూలు కుటుంబాలలో మోస్తరుగా కాకుండా మనరోల్స్ రివర్స్ అయినాయి గదూ! అదేనా మీరనేది?' అనడిగింది.

తనను చుట్టుకు పోతున్న మీరాను పరిశీలనగా చూస్తూ- పదిలంగా పొదివి పట్టుకుంటూ 'అయినందుకు నాకేం విచారం లేదు' అని ప్రభు మనసు లోనే అనుకుందామని- అనుకున్నాడు గాని ఆ మాటలు పైకే వచ్చేశాయి.

'ఈ అనుభవం అపూర్వమైనది. మీరు యేమయినా చెప్పండి' అంది మీరాదేవి. మరేదో లోకంనుంచి మాట్లాడుతున్నట్లుగా.

'ఓహో! అబ్బాయికి అప్పుడే పేరు పెట్టేశావే!' అన్నాడు ప్రభు.

'అదేమిటి? అంది ఉలిక్కిపడుతూ మీరాదేవి. 'అవును, మీరా. ఇప్పుడు నీవు అనుకోకుండానే అనేసిన మాటలు!'

'ఏమిటవి? చెప్పండి. నేను యేమన్నాను? ఏమన్నానో నాకేతెలియదు' అంది మీరాదేవి.

'అనుభవ....అపూర్వ.... అబ్బాయి అయినా, అమ్మాయి అయినా ఈ పేర్లు పనికివస్తాయిగా' అన్నాడు తాపీగా ప్రభు.

చాలాసేపటి వరకు మీరాదేవి ఆలోచిస్తూనే వుండిపోయిందో లేక, ఆలోచనలతో నిమిత్తం లేని తన్మయతలో ఉండిపోయిందో గాని- ఏమీ మాట్లాడలేక పోయింది.

✱